ఏసీబీకి చిక్కిన ఏఎస్ఐ

మేడ్చల్, అక్టోబరు 7: లంచం తీసుకుంటున్న ఏఎస్ఐని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సికింద్రాబాద్‌లో నివాసం ఉండే శర్మ మేడ్చల్ మండలం గౌడెవల్లి గ్రామ పరిధిలోని సాకేత్ ప్రణామ్‌లో ఇల్లు నిర్మించారు. ఇంటీరియర్ పనుల కోసం సరూర్‌నగర్‌కు చెందిన విశ్వనాథ్‌తో రూ.8 లక్షల చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నారు. విశ్వనాథ్‌కు రూ.4 లక్షలను ముందుగా చెల్లించారు. కొన్ని రోజులు పనిచేసిన తర్వాత మరికొంత డబ్బు కావాలని విశ్వనాథ్ కోరాడు. ఇందుకు శర్మ నిరాకరించారు. దీంతో పని ఆగిపోయింది. ఈ విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగడంతో శర్మ మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదైంది. ఈ కేసులో జోక్యం చేసుకున్న ఏఎస్ఐ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

మెయిన్‌హార్ట్‌కే మూసీ సుందరీకరణ!

- సింగపూర్ కంపెనీకి మాస్టర్ ప్లాన్ తయారీ బాధ్యతలు
- ఆర్థిక నేరగాళ్లుగా ప్రకటించిన పాకిస్థాన్ ప్రభుత్వం
- దానికే 4 రోజుల కిందట రూ.166 కోట్ల టెండర్ ఖరారు
- కంపెనీ బాగోతాన్ని ముందే బయటపెట్టిన బీఆర్ఎస్

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): వేలాది పేద, మధ్యతరగతి కుటుంబాలను రోడ్డు మీద పడేసి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న 'మూసీ సుందరీకరణ' ప్రాజెక్టు బాధ్యతను అంతర్జాతీయంగా మోసపూరిత కంపెనీగా పేరొందిన 'మెయిన్‌హార్ట్'కు కట్టబెట్టింది. పాకిస్థాన్‌లో వందల కోట్ల మేర ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డ కంపెనీకి మూసీ సుందరీకరణ మాస్టర్‌ప్లాన్ తయారీ టెండర్ అప్పగించింది. మూసీ మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు సంబంధించి రూ.166 కోట్ల పనులు కేటాయించింది. ఇకపై మూసీ ప్రాజెక్టు భవిష్యత్తు మొత్తం ఈ కంపెనీ చేతుల్లోనే ఉండనుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది మొదలు మూసీ సుందరీకరణను లక్షన్నర కోట్ల బడ్జెట్‌తో తీస్తున్న సినిమా మాదిరిగా తెరపై రంగుల కలను చూపిస్తున్నది. దాని చాటున వేల కుటుంబాలను బలి తీసుకుంటున్నది. ఇప్పుడు దొంగకు మరో దొంగ తోడైనట్టు.. పాకిస్థాన్ ప్రభుత్వం ఆర్థిక నేరగాళ్లుగా ప్రకటించిన వ్యక్తుల కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం జతకట్టింది. లక్షన్నర కోట్ల ప్రాజెక్టును వాళ్ల చేతుల్లో పెట్టింది. మాస్టర్‌ప్లాన్ తయారీకి కన్సల్టెన్సీ బాధ్యతలను మెయిన్‌హార్ట్ కంపెనీకి అప్పగిస్తూ పురపాలక శాఖ ఆధ్వర్యంలోని మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఈ నెల 4న నిర్ణయం తీసుకుంది. టెండర్ ఖరారు చేసి నాలుగు రోజులు గడిచినా ఈ జీవో బయటకు విడుదల చేయకుండా గుట్టుగా ఉంచడం విశేషం. జీవో వివరాలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదు.

టెండర్లు పిలిచిన మరుసటి రోజే భేటీ..

మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు కన్సల్టెంట్ నియామకానికి ఈ ఏడాది ఫిబ్రవరి 5న పురపాలక శాఖ టెండర్లు పిలిచింది. ఆ మరుసటి రోజే మెయిన్‌హార్ట్ కంపెనీ ప్రతినిధులు నేరుగా సీఎం రేవంత్‌రెడ్డితో సచివాలయంలో భేటీ అయ్యారు. ప్రాజెక్టు డిజైన్లను వివరించారు. అదేరోజు కంపెనీ బాగోతాన్ని బీఆర్ఎస్ నేత క్రిశాంక్ బయటపెట్టారు. ఆర్థిక నేరాలకు పాల్పడ్డ కంపెనీతో ఎలా చర్చలు జరుపుతారని, లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టును ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని 'నమస్తే తెలంగాణ' సైతం బయట పెట్టింది. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. దీనిని బట్టి మూసీ సుందరీకరణ ప్రాజెక్టును మెయిన్‌హార్ట్‌కే అప్పగించాలని ముందుగానే నిర్ణయించుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. టెండర్ నిబంధనలు కూడా కంపెనీకి అనుకూలంగా రూపొందించారని అంటున్నారు.

రూ.166.48 కోట్లకు టెండర్ ఖరారు

'మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్'కు మాస్టర్‌ప్లాన్ రూపొందించే బాధ్యతను మూడు కన్సల్టెన్సీల కన్సార్షియంకు అప్పగిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఈ నెల 4న ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో మెయిన్‌హార్ట్ సింగపూర్ ప్రైవేట్ లిమిటెడ్‌తోపాటు కుష్మన్ వేక్‌ఫీల్డ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఆర్ఐఓఎస్ డిజైన్స్ స్టూడియో ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వాములుగా ఉన్నాయి. ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఇచ్చిన ప్రతిపాదనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది.

కాంగ్రెస్ తీరుపై విమర్శలు వెల్లువ..

అంతర్జాతీయంగా అభియోగాలున్న కంపెనీకి టెండర్లు కట్టబెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టు అని చెప్పుకుంటూ ఇలాంటి కంపెనీకి కట్టబెట్టడం ద్వారా ప్రజలకు ఏం చెప్పదలుచుకున్నారని ప్రశ్నిస్తున్నారు. కాస్త ఇంటర్నెట్ పరిజ్ఞానం ఉన్న ఎవరికైనా.. కంపెనీ బాగోతం తెలిసిపోతుందని అంటున్నారు. నెటిజన్లు, రాజకీయ నాయకులు, మీడియా ఈ విషయాన్ని ఎన్నిసార్లు చెప్పినా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడంలేదని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గురుకులాల్లో ఇంటర్ వరకూ ప్రవేశాలు

- ఎంసెట్, నీట్ కోచింగ్‌కు చర్యలు
- త్వరలోనే పేరెంట్స్ టీచర్స్ మీటింగ్: మంత్రి పొన్నం
- బీసీ సంక్షేమ, సొసైటీ అధికారులతో సమావేశం

హైదరాబాద్, అక్టోబర్7 (నమస్తే తెలంగాణ): వచ్చే విద్యా సంవత్సరం నుంచి మోడల్ స్కూళ్ల తరహాలో బీసీ గురుకులాల్లో కూడా పదోతరగతి తరువాత నేరుగా ఇంటర్ ప్రవేశాలు కల్పిస్తామని, విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేస్తామని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. బీసీ గురుకులాల్లో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉండేలా సమాలోచనలు చేస్తున్నామని వివరించారు. బీసీ సంక్షేమశాఖలోని అన్నివిభాగాల ఉన్నతాధికారులతో విస్తృత స్థాయి సమావేశాన్ని బంజారాహిల్స్‌లోని కొమురంభీమ్ భవన్‌లో సోమవారం నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీసీ గురుకులంలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉండేలా, ఎంసెట్, నీట్ కోచింగ్ ఇచ్చేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. హాస్టల్ వార్డెన్ల ప్రమోషన్లపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. గురుకులాల కోసం ఎమ్మెల్యే, ఎంపీ ఆ జిల్లా మంత్రి, ఎమ్మెల్సీలు వారి నిధుల నుంచి కేటాయించేలా కలెక్టర్ దృష్టికి తీసుకుపోవాలని సూచించారు. ఈనెల 15-31లోపు ప్రతి గురుకులంలో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేయాలని, వారి సలహాలు, సూచనలు తీసుకొని ఫీడ్ బ్యాక్ అందించాలని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడానికి ప్రతి గురుకులలో బాక్స్ ఏర్పాటు చేసి ఆర్సీవోలు పరిశీలించాలని సూచించారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి, గురుకుల సెక్రటరీ సైదులు, ఎంబీసీ కార్పొరేషన్ ఎండీ అలోక్ కుమార్, బీసీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్యభట్టు, అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్, జేడీ సంధ్య, నాయీబ్రాహ్మణ ఎండీ ఇందిర, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీబీసీడీవోలు, ఏడీబీసీడీవోలు, ఆర్సీవోలు, డీసీవోలు, ప్రిన్సిపాల్స్, హాస్టల్ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.1502 కోట్లు

హైదరాబాద్, అక్టోబర్7(నమస్తే తెలంగాణ): బీసీ సంక్షేమశాఖ బీసీ విద్యార్థులకు అమలు కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్, వివిధ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.1502.83కోట్ల నిధులను విడుదల చేసింది. సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ స్కాలర్‌షిప్‌ల కోసం ప్రభుత్వం మొత్తంగా రూ.1890.34కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. ఇప్పటికే 387.51కోట్లను విడుదల చేయగా, మిగిలిన రూ.1502.83కోట్ల నిధులను తాజాగా విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఉద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దు

- సమస్యల పరిష్కారానికి చర్చలకు ఆహ్వానించాలి
- టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

కొత్తపల్లి, అక్టోబర్ 7 : ప్రభుత్వం ఉద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దని, న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్చలకు ఆహ్వానించాలని, లేకుంటే దసరా తర్వాత భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ హెచ్చరించారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏలను దసరాలోపు ప్రకటించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల వేతనాలు, ఇతర బిల్లుల చెల్లింపులను ఈ-కుబేర్‌తో కాకుండా జిల్లా ట్రెజరీల ద్వారా అందేలా చూడాలని, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను వెంటనే ప్రకటించాలని కోరారు. లీవ్ సాలరీ, జీపీఎఫ్ లోన్లు, మెడికల్ బిల్లులు, లీవ్ ఇన్ క్యాష్ అసెస్మెంట్, బిల్డింగ్ లోన్లను వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, నాయకులు ముప్పిడి కిరణ్‌కుమార్, నాగుల నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్‌రెడ్డి, ఒంటెల రవీందర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, గంగారపు రమేశ్, సర్దార్ హర్మీందర్‌సింగ్, రాజేశ్ భరద్వాజ్, సబిత, విజయలక్ష్మి, రాజేశ్వర్‌రావు, రామస్వామి, వివిధ డిపార్ట్‌మెంట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇక గుండె చెరువే!

మొదటిపేజీ తరువాయి...

మూసీ ప్రక్షాళన పేరిట చేపట్టిన కూల్చివేతలే సామాన్యుడిని కలవర పెడుతుంటే.. చెరువుల రీ సర్వే అంటే కనుమరుగైన ఎన్నో చెరువుల పేరిట అగ్గిరాజేసేందుకు కసరత్తు చేస్తున్నది. ఇన్నేండ్లు హెచ్ఎండీఏ నిర్దేశించిన చెరువుల బఫర్, ఎఫ్టీఎల్ ఆధారంగా అన్ని అనుమతులు, ఎన్వోసీలతో భవనాలు నిర్మించుకున్నా.. వాటితో సంబంధం లేకుండా బుల్డోజర్లను దింపనున్నది.

చెరువుల రీ సర్వే: భట్టి

చెరువుల రీ సర్వే చేపట్టనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. 'పదేండ్లలో చెరువులన్నీ విధ్వంసానికి గురయ్యాయి. ఎంతో మంది చెరువు భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఇలానే వదిలేస్తే నగరంలో చెరువులు కనుమరుగయ్యే ప్రమాదం ఉన్నది. ఇప్పటివరకు ఆక్రమించుకున్న చెరువుల బఫర్ జోన్ ప్రాంతాలను వదిలేస్తాం. కానీ ఎఫ్టీఎల్ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం. చెరువులు, కుంటల ఎఫ్టీఎల్ భూములను పరిరక్షించేలా సర్వే చేపడతాం. గతంలోనూ ఆక్రమణలు జరిగాయి. చెరువులు, కుంటల విషయంలో జరిగిన లోపాలను సవరించి ఎఫ్టీఎల్ వరకైనా జలవనరులను కాపాడుకుంటాం' అని వెల్లడించారు.

45 ఏండ్ల డాటాతో ఎఫ్టీఎల్ గుర్తింపు: రంగనాథ్

చెరువుల హద్దులను శాస్త్రీయంగా గుర్తించేలా చర్యలు చేపట్టినట్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. 45 ఏండ్ల డాటా ఆధారంగా చెరువుల ఎఫ్టీఎల్, పూర్తిస్థాయి వాటర్ స్ప్రెడ్ ఏరియాను గుర్తించేందుకు ఎన్ఆర్ఎస్ఏ, స్టేట్ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్, ఇరిగేషన్ విభాగాల డాటాను ప్రామాణికంగా తీసుకుంటామని తెలిపారు. హైడ్రా కార్యాలయంలో సోమవారం లేక్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించిన ఆయన.. విలేజ్ మ్యాప్స్, ల్యాండ్ యూజ్ సర్వే నంబర్లతో సహా సమాచారం ఇచ్చే క్యాడస్ట్రల్ మ్యాప్స్, 45 ఏండ్లలో పూర్తిస్థాయిలో చెరువు నీరు విస్తరించిన తీరుపై సమాచారాన్ని సేకరిస్తామని వివరించారు. హిమాయత్ సాగర్‌తో ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ల గుర్తింపు ప్రారంభించి అదే విధానాన్ని అన్ని చెరువులకు వర్తింపజేస్తామని చెప్పారు. ఓఆర్ఆర్ పరిధిలో ఎన్ని చెరువులు ఉన్నాయో, ఎంత మేర ఆక్రమణలకు గురయ్యాయో లెక్కలు తేల్చాలని అధికారులకు సూచించారు.

హైడ్రా ప్రత్యేక యాప్

నగరంలో చెరువుల ఆక్రమణలను ఉపేక్షించేది లేదని రంగనాథ్ స్పష్టంచేశారు. చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు, ప్రజావసరాలకు నిర్దేశించిన స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా నిరంతరం నిఘా పెట్టేందుకు హైడ్రా చర్యలు చేపట్టిందని అన్నారు. ఆక్రమణలను వెంటనే గుర్తించేలా హైడ్రా ప్రత్యేక యాప్‌ను తీసుకొస్తున్నట్టు చెప్పారు. ఈ యాప్ ద్వారా ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుందని, తక్షణమే క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన, చర్యలు ఉంటాయని వివరించారు. ఆక్రమణలను తొలగించి చెరువుల్లో డెబ్రీస్‌ను పూర్తి స్థాయిలో తొలగిస్తామని చెప్పారు. మొదటిదశగా సున్నం చెరువు, అప్పా చెరువు, ఎర్రకుంట, కూకట్‌పల్లి నల్ల చెరువు పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

పాత చెరువులకు కొత్త హద్దులు

ఏడు జిల్లాల హెచ్ఎండీఏ పరిధిలో 3,532కిపైగా చెరువులు ఉన్నాయి. చెరువు హద్దుల నిర్ధారణ, పర్యవేక్షణ, నిర్వహణ, పరిరక్షణ, ఆధునీకరణ కార్యకలాపాలను అదే చూసుకుంటుంది. ఇప్పటివరకు 2,525 చెరువులకు ప్రాథమిక హద్దులను ఖరారు చేసింది. ఇందులో 230 చెరువులకు మాత్రమే బఫర్ జోన్, ఎఫ్టీఎల్ నిర్ధారించింది. మిగిలిన వాటికి ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నది. ఈ క్రమంలో సమగ్రమైన వివరాలతో తుది నోటిఫికేషన్ జారీ చేయాల్సింది పోయి.. ఇప్పటివరకు చేసిన హద్దులను చెరిపివేసి, మొదటి నుంచి ప్రక్రియను మొదలుపెట్టనున్నది. ఈ లెక్కన పాత చెరువులకు కొత్తగా హద్దులను ఏర్పాటుచేసి పరివాహక ప్రాంత జనాలను కలవరపెట్టేలా కాంగ్రెస్ అడుగులు వేస్తున్నది. రీ సర్వే పేరిట హద్దు రాళ్లను చెరిపేసి కొత్తగా హద్దులను నిర్ధారిస్తే పాత హద్దులు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు ఇచ్చిన క్లియరెన్సులు బుట్టదాఖలు కానున్నాయి.

రీ సర్వేతో రియల్ ఎస్టేట్ కుదేల్

ఇప్పటికే హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరిట చేపట్టిన కూల్చివేతలతో రియల్ ఎస్టేట్ రంగం ఢమాల్ అన్నది. ఇక దశాబ్దాల కాలంగా మూసీ వెంబడి ఉన్న నిర్మాణాలను కూలదోసేలా హద్దులను నిర్ధారిస్తుండగా, చెరువుల రీ సర్వే చేస్తే పేద, మధ్యతరగతి వర్గాలు కట్టుకున్న నిర్మాణాలన్నీ కూలిపోనున్నాయి. కుదేలైన రియల్ ఎస్టేట్ రంగాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం చెరువుల రీ సర్వే చేసి తులసి నీళ్లు పోసే కుట్రకు దిగిందని నిపుణులు పేర్కొంటున్నారు.

వరద సాయం 11,713 కోట్లు ఇవ్వండి

- సీఆర్ఎఫ్ క్యాంపులు పెట్టండి
- ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్‌ను తీవ్రవాద ప్రభావిత జిల్లాల్లో చేర్చండి
- మెట్రోరైలు రెండో దశకు సహకరించండి
- కేంద్రమంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి వినతి

హైదరాబాద్, అక్టోబర్7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలు, వరద నష్టం కింద రూ.11,713.49 కోట్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ సీఎస్ఎంపీని అమృత్ 2.0లో చేర్చాలని, మెట్రో రైలు రెండో దశకు సహకారం అందించాలని కోరారు. కేంద్ర హోంశాఖ నిర్వహించిన సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి అనంతరం హోం మంత్రి అమిత్‌షాతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా భారీవర్షాల వల్ల వాటిల్లిన నష్టాన్ని అమిత్‌షాకు వివరించారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాల నుంచి తొలగించిన ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలను తిరిగి చేర్చాలని కోరారు. అంతర్గత భద్రతను దృష్టిలో ఉంచుకొని భద్రాద్రికొత్తగూడెం జిల్లా చర్ల మండలం కొండవాయి, ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామాల్లో సీఆర్ఎఫ్ జేటీఎఫ్ క్యాంపులు ఏర్పాటుచేయాలని విన్నవించారు. ఎస్డీవోల పెండింగ్ నిధులు విడుదల చేయాలని, 1,065 మందిని ఎస్డీవోల్లో చేర్చుకోవడానికి నిబంధనలు సడలించాలని కోరారు. తీవ్రవాద వ్యతిరేక వ్యూహాల్లో శిక్షణకు అదనంగా రూ.25.59 కోట్లు అవసరమని, ఆ మొత్తాన్ని విడుదల చేయాలని, రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. తెలంగాణకు అదనంగా 29 అదనపు ఐపీఎస్ పోస్టులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. హైదరాబాద్ సీఎస్ఎంపీని అమృత్ 2.0లో చేర్చాలని కోరారు. మూసీలో మురుగు చేరకుండా ఉండేందుకు ట్రంక్ సీవర్స్ మెయిన్స్, లార్జ్‌సైజ్ బాక్స్ డ్రెయిన్స్, కొత్త సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణానికి రూ.4 వేల కోట్లతో రూపొందించిన డీపీఆర్‌ను కేంద్ర మంత్రికి అందజేశారు. డీపీఆర్‌ను ఆమోదించడంతోపాటు పనుల అనుమతికి చొరవ చూపాలని కోరారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు రూ.24,269 కోట్ల వ్యయంతో డీపీఆర్‌ను సమర్పిస్తామని, అది త్వరగా కార్యరూపం దాల్చేందుకు సహకరించాలని ఖట్టర్‌ను కోరారు. ముఖ్యమంత్రి వెంట ఎంపీలు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, వంశీకృష్ణ, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, సీఎస్ శాంతికుమారి, ముఖ్య కార్యదర్శులు వీ శేషాద్రి, దానకిశోర్, హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

5 నెలలుగా అధికారుల అరిగోస

- లోక్‌సభ ఎన్నికల్లో 14 శాఖల్లో బదిలీలు
- ఐదు నెలలైనా వెనక్కి రప్పించని వైనం
- పనిఒత్తిడిలో ఎందరో అనారోగ్యాల పాలు
- తక్షణమే రప్పించాలని కోరుతున్న ఉద్యోగులు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): 'ఉద్యోగుల్లో అశాంతి మంచిది కాదు. అలాంటి పరిస్థితులుంటే వారు సరిగ్గా పనిచేయలేరు. అందుకే పదోన్నతులు ఇచ్చాం. బదిలీలు చేపడతున్నాం. అసంతృప్తిని దూరం చేస్తున్నాం' ఇది తరుచూ సీఎం మొదలు మంత్రుల వరకు చెప్పే నీతివాక్యాలు. కానీ గత లోక్‌సభ ఎన్నికల సమయంలో వివిధ స్థాయిల్లో ఉన్న వందలాది మంది అధికారులను బదిలీ చేసి ప్రభుత్వం వారిని వెనక్కి రప్పించడాన్ని విస్మరించింది. వీరి గోడును కనీసం పట్టించుకోకుండా గాలికొదిలేసింది. దీంతో వారంతా ఐదునెలలుగా ఆపసోపాలు పడుతున్నారు. ఎన్నికల సమయంలో కొన్ని కీలక శాఖల్లోని ఉద్యోగులను బదిలీచేయడం, ఎన్నికలు పూర్తికాగానే తిరిగి వెనక్కి రప్పించడం అనవాయితీ. ఈ తరహాలోనే మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ముందు ఉద్యోగులను పెద్ద ఎత్తున బదిలీ చేశారు. పంచాయతీరాజ్, పోలీస్, అటవీ, రెవెన్యూ, మున్సిపల్, ఎక్సైజ్ సహా 14 శాఖల్లో ఈ బదిలీలు జరిగాయి. మున్సిపల్ కమిషనర్లు సహా కింది స్థాయి ఉద్యోగులు, ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఇన్‌స్పెక్టర్లు, ఇన్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలను బదిలీచేశారు. ఎన్నికలను సాకుగా చూపి ఇష్టారీతిన ఆనాడు బదిలీలు చేశారు. కనీసం ఆప్షన్లు కూడా ఇవ్వకుండా, ఒక్కొక్కరిని జిల్లాలకు జిల్లాలను దాటించి 150 నుంచి 300 కిలోమీటర్ల దూరంలో పోస్టింగ్ ఇచ్చారు. ఎన్నికలు పూర్తవగానే వెనక్కి వస్తామన్న ధీమాతో ఆనాడు వెళ్లారు. కానీ ఎన్నికలు ముగిసి దాదాపు 5 నెలలు గడిచించి. కానీ బదిలీ చేసిన వారిని మాత్రం వెనక్కి రప్పించలేదు.

పనిఒత్తిడితో ఆరుగురు చనిపోయారు

లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆప్షన్లు ఇవ్వకుండా ఇష్టారీతిన బదిలీలు చేశారు. కొందరు ఎంపీడీవోలను 250 నుంచి 300 కిలోమీటర్ల దూరంలో వేశారు. నల్లగొండ జిల్లా వారిని నారాయణపేట జిల్లాకు బదిలీచేశారు. అనేక మంది కుటుంబాలకు దూరమయ్యారు. ఈ రెండు నెలల్లో పని ఒత్తిడితో ఆరుగురు ఎంపీడీవోలు చనిపోయారు. ఇప్పటి వరకు ఆరుసార్లు మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం సమర్పించాం. సీఎస్‌లను కలిసి బదిలీ అయిన వారిని వెనక్కి రప్పించాలని కోరాం. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించి ఇప్పటికైనా వారిని వెనక్కి రప్పిస్తుందని ఆశిస్తున్నాం.

- పద్మావతి, ఎంపీడీవోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

జిల్లాలకు జిల్లాలే దాటించారు!

వివిధ జిల్లాల్లోని 399 మంది ఎంపీడీవోలను ఇష్టారీతిన బదిలీ చేశారు. వికారాబాద్ జిల్లాలోని ఓ ఎంపీడీవోను నారాయణపేట జిల్లాకు బదిలీచేశారు. నల్లగొండ నుంచి మెదక్, నారాయణపేట, వికారాబాద్ నుంచి సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలో కర్ణాటక బార్డర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. వరంగల్ నుంచి ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేసిన దాఖలాలు ఉన్నాయి. దాదాపు 300 మంది ఎంపీడీవోలను 150 కిలోమీటర్ల దూరంలో పోస్టింగ్ ఇచ్చారు. వీరిలో ఒక్కరినీ వెనక్కి తీసుకురాలేదు.

గల్ఫ్ మృతుల కుటుంబాలకు 5 లక్షల ఎక్స్‌గ్రేషియా

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): గల్ఫ్ మృతుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం రూ. 5లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

ఈడీ కస్టడీకి సాహితీ అధినేత

హైదరాబాద్ (నాంపల్లి కోర్టులు), అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): సాహితీ ఇన్‌ఫ్రా సంస్థ అధినేత లక్ష్మీనారాయణను 5రోజుల కస్టడీకి అప్పగిస్తూ ఈడీ కోర్టు జడ్జి సురేశ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడి తరపు న్యాయవాది సమక్షంలో ఈడీ విచారణ చేపట్టాలని కోర్టు సూచించింది. వందల మందిని నమ్మించి 2,500 కోట్ల కుంభకోణానికి సాహితీ ఇన్‌ఫ్రా సంస్థ పాల్పడిందని ఆరోపణలున్నాయి.

కర్ణాటక బస్సు, బైక్ ఢీకొని నలుగురి మృతి

మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు

జహీరాబాద్, అక్టోబర్ 7: కొద్దిక్షణాల్లో ఇంటికి చేరుకుంటామనుకునేలోగా ఎదురుగా మృత్యురూపంలో వచ్చిన కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాతపడ్డారు. ఈ విషాద ఘటన సోమవారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం గణేశ్‌పూర్‌లో చోటుచేసుకుంది. గణేశ్‌పూర్‌కు చెందిన గునెల్లి సిద్రామప్ప (71), ఆయన అల్లుడు జగన్నాథ్ (42), కూతురు రేణుక(38), మనుమడు వినయ్‌కుమార్(15) పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తూ.. బైక్‌పై రోడ్డు దాటుతుండగా జహీరాబాద్ నుంచి బీదర్‌కు వెళ్తున్న కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సిద్రామప్ప అక్కడిక్కడే మృతి చెందాడు. జగన్నాథ్, అతడి భార్య రేణుక, కుమారుడు వినయ్‌కుమార్‌లను చికిత్స కోసం కారులో బీదర్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు. జహీరాబాద్ డీఎస్పీ రాంమోహ్మన్‌రెడ్డి, రూరల్ సీఐ హనుమంతు, హ